క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న సోమశేఖర్

ఇచ్చోడ: ఎస్సీ వర్గీకరణ కోసం ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమించాలని ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని అవంతి కళాశాల్లో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మాదిగ జాతికి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జరుగుతున్న అన్యాయంపై దండోర వేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేశ్, జిల్లా కో కన్వీనర్ బరుకుంట సుభాష్ మాదిగ, దూబాక సుభాష్, గొటు ముకులే మధుకర్, జన్నరపు సాయి, కిరణ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోథ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉమేష్ రావు తెలిపారు. 6 నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లీష్ సబ్జెక్టులో బోధించడానికి (టీజీటీ) డిగ్రీతో పాటు బీఈడీ చేసిన అభ్యర్థులు, 9 నుంచి 10వ తరగతికి హిందీ బోధించడానికి (టీజీటీ) డిగ్రీతో పాటు బీఈడీ, ఇంటర్లో జువాలజీ బోధించేందుకు పీజీతో పాటు బీఈడీ చేసి ఉండాలన్నారు. ఈనెల 22న లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'గృహలక్ష్మి' సర్వే వేగవంతం చేయాలి



కార్యదర్శులతో సమావేశమైన ఎంపీడీవో

ఇంద్రవెల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి దరఖాస్తుల సర్వేను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో పుష్పలత అన్నారు. గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే గురించి పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. గృహలక్ష్మి దరఖాస్తులతో ఇంటింటికీ సందర్శించి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఇంటి స్థలం ఉందా? ఇంటి పన్ను, ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయ అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

తాంసి: మండల సర్వసభ్య సమావేశానికి సరిపడా కోరం సభ్యులు లేక శనివారం వాయిదా వేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మంజుల అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సభ్యులు హాజరు కాలేదు. వర్షం కారణంగా సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో భూమయ్య తెలిపారు. తిరిగి ఎంపీపీ అనుమతితో సమావేశాన్ని మళ్లీ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం

బజార్హత్నూర్: సోయా పంట పూత దశలో ఉండడంతో నేలలో తేమ తగ్గిపోవడంతో రైతులు వర్షం కోసం వారం రోజులుగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు శుక్రవారం రాత్రి నుంచి మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి వాగులు పొంగిపొర్లి ప్రవహిస్తున్నాయి.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

ఇంద్రవెల్లి: ఈనెల 21న నాగుల పంచమి పండుగను పురస్కరించుకొని నాగోబా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తామని నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్నాథ్లు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అదే విధంగా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి'

కుంటాల: అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని వెంకూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులు కోరారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రిని శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే విఠల్రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

భైంసారూరల్: అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని మండలంలోని తిమ్మాపూర్ గ్రామ దళిత సంఘం యువకులు కోరారు. శనివారం భైంసాకు విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు.

పేదల ముంగిట వైద్యసేవలు

- బస్తీ దవాఖానాలతో సత్వర వైద్యం
- ప్రారంభానికి సిద్ధమవుతున్న వెల్నెస్ సెంటర్



బాలుడిని పరీక్షిస్తున్న వైద్యుడు

కైలాస్నగర్: ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైద్యరంగానికి ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ ఆసుపత్రులు ఐదు కిలోమీటర్ల దూరం వరకు ప్రజలకు అందుబాటులో లేనటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అక్కడి ప్రజానీకం వైద్యం కోసం కిలోమీటర్లు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే బస్తీ దవాఖానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఇప్పటికే రెండు బస్తీ దవాఖానాలను ప్రారంభించగా తాజాగా న్యూహౌజింగ్బోర్డు పరిధిలో మరో వెల్నెస్ సెంటర్ రోగుల కోసం సిద్ధమవుతుంది. వీటి ఏర్పాటుతో రోగులకు సత్వర వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

సత్వర వైద్యసేవలే లక్ష్యం..

ఆదిలాబాద్ పట్టణ ప్రజలు ఏదైనా అనారోగ్యానికి గురైతే పట్టణ ఆరోగ్య కేంద్రాలతో పాటు రిమ్స్ ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. చిన్నపాటి జబ్బులకు సైతం కిలోమీటర్ల దూరంలోని ఆసుపత్రులకు వెళ్లాలి. అయితే ఐదు వేలకు పైగా జనాభా ఉండడం, పేద ప్రజలే ఎక్కువ ఉన్నటువంటి ప్రాంతాల్లోని రోగులకు సత్వర వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తోంది. పీహెచ్సీ, యూహెచ్సీల తరహాలో ఇందులో వైద్యాధికారితో పాటు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలను నియమించింది. జ్వరం, వాంతులు, విరేచనాలు, తలనొప్పి వంటి చిన్నపాటి జబ్బులకు దూరంలోని ఆసుపత్రికి వెళ్లకుండా స్థానికంగానే వైద్యులు పరీక్షించి చేసి మందులు అందజేస్తారు. ఏమైనా రక్త పరీక్షలు అవసరముంటే వారి నమూనాలను సేకరిస్తారు. మెరుగైన వైద్యం అవసరమనుకుంటే రిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేస్తారు.

త్వరలో మరో సెంటర్ అందుబాటులోకి..

వేల సంఖ్యలో జనాభా కలిగి ఉన్నప్పటికీ స్థానికంగా ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేనటువంటి బంగారుగూడ, కేఆర్కే కాలనీల్లోని ప్రజలకు వైద్యాన్ని చేరువ చేసేలా మున్సిపల్ ఆధ్వర్యంలో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. బంగారుగూడలో రూ.15లక్షల వ్యయంతో నిర్మించగా, కేఆర్కే కాలనీలో రూ.13.5లక్షల వ్యయంతో బస్తీదవాఖానాను సుందరంగా సకల వసతులతో తీర్చిదిద్దారు. వైద్యం కోసం వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడగానే ఆకట్టుకునేలా నిర్మించారు. ప్రాథమిక వైద్యానికి అవసరమైన మందులన్నింటిని అందుబాటులో ఉంచుతున్నారు. ఈరెండు కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమై పేదప్రజల వైద్యానికి ఉపయోగకరంగా ఉండటంతో తాజాగా న్యూహౌజింగ్బోర్డు పరిధిలో పల్లె దవాఖానా వెల్నెస్ సెంటర్ను నిర్మిస్తున్నారు. ఐటీడీఏ ద్వారా రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయి. అంతర్గత వసతులు కల్పించాల్సి ఉండడంతో మరో నెల రోజుల్లోనే ఈ కేంద్రాన్ని ప్రారంభించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈసెంటర్ ప్రారంభమైతే 170 సర్వేనెంబర్లోని పేదలతో పాటు న్యూహౌజింగ్బోర్డు ప్రజలకు మెరుగైన వైద్యం లభించనుంది.



బస్తీ దవాఖానాలోని వెయిటింగ్ హాల్

ఫొటోలతో జ్ఞాపకాలు పదిలం



రక్తదానం చేస్తున్న ఫొటోగ్రాఫర్లతో ఎమ్మెల్యే రామన్న

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్: ఏళ్ల నాటి జ్ఞాపకాలను ఫొటోలు పదిలంగా ఉంచుతాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ఫొటోగ్రఫీ ఆద్యుడు లూయిస్ జాక్విస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకాలు, మధురమైన ఘట్టాలను ఫొటోగ్రాఫర్లు బంధిస్తారన్నారు. ఎన్నో అద్భుతాలను తీసే ఫొటోగ్రాఫర్ల పనితీరు అభినందనీయమన్నారు. జిల్లాలో ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి, ఫొటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పలువురు ఫొటోగ్రాఫర్లకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మెట్టు ప్రహ్లాద్, అసోసియేషన్ అధ్యక్షుడు దోడ అశోక్, మురళీధర్ అహుజా, అనిల్ కుమార్, ప్రవీణ్, హరికృష్ణ, సంతోష్, విశాల్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం

కైలాస్నగర్: క్రీడాకారులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. తెలంగాణ డాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. జిల్లాలో డాన్స్ స్పోర్ట్స్ పోటీల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

అందరి అభివృద్ధే లక్ష్యం

ఆదిలాబాద్రూరల్: అందరి అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో మైనార్టీలకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి రానున్న రోజుల్లో మద్దతు ఇవ్వాలన్నారు. మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. వంద శాతం రాయితీ రుణాలతో పాటు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పలువురు జెడ్పీటీసీలకు, ఎంపీపీలకు, ఆయా మండలాల ఎంపీడీవోలకు చెక్కుల పంపిణీకి సంబంధించిన సమాచారం ఇవ్వకపోవడంతో మైనార్టీ అభివృద్ధి శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, ఎంపీపీలు గండ్రత్ రమేశ్, తుల శ్రీనివాస్, మార్శెట్టి గోవర్ధన్, మావల జెడ్పీటీసీ వనిత, కృష్ణవేణి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

5కే రన్ విజయవంతం



నార్నూర్: 5కే రన్లో తహసీల్దార్, నాయకులు



బోథ్: పాల్గొన్న అధికారులు, ప్రజలు

నార్నూర్: మండల కేంద్రంలోని గాంధీ చౌక్ నుంచి భీంపూర్ వరకు 5కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆయా పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజలింగం మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, పోలింగ్ బూత్ వద్ద బీఎల్వోలు అందుబాటులో ఉంటారని, వారి వద్దకు వెళ్లి ఫారం 6 నింపి ఇవ్వాలని సూచించారు. ఈనెల 21 నుంచి 28 వరకు ఓటుహక్కు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అమృతలాల్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ గంగాసింగ్, ఏకలవ్య గురుకుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాములు, శివ, సమయ్య, పీఈడీ అనుసయ, అతుల్కుమార్ పాల్గొన్నారు.

బోథ్: ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు బోథ్ నియోజకవర్గంలో శనివారం ఉదయం 7 గంటలకు 5కే రన్ నిర్వహించారు. మండల కేంద్రం నుంచి టీఎస్డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల వరకు రన్ నిర్వహించారు. ఓటు గురించి ప్రజలకు, యువకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బోథ్ తహసీల్దార్ సుభాష్ చంద్ర, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

తలమడుగు: మండలంలోని భరంపూర్ గుట్టపైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం కోడద్ గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి సందర్శించి స్వామివారికి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనంద్, ఆలయ కమిటీ సభ్యులు మల్లేశ్, ప్రతాప్, నగారెడ్డి, రాజు మల్లారెడ్డి, ఆశన్న, మేర రమేశ్, గోవర్ధన్ రెడ్డి, రమేశ్రెడ్డి, లక్ష్మారెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

బోథ్: మండల కేంద్రంలోని ప్రసాద్ ఆసుపత్రిలో వైద్యులు రవీంద్రప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచే ఉచిత గుండె పరీక్షల కోసం ప్రజలు బారులు తీరారు. ఈసీజీ, టుడికో, బ్లడ్ షుగర్తో పాటు పలు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారిని ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్డియాలజిస్ట్ స్పందన, వైద్యులు శైలజ, దత్తురాజ్, అలోక్, జెడ్పీటీసీ సంధ్యారాణి పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



బోథ్: కేక్కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు



నేరడిగొండలో..

నేరడిగొండ: మండల కేంద్రంలోని ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఫొటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు విజయ్, సురేశ్, అన్వేష్, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

బోథ్: మండల ఫొటోగ్రఫీ యూనియన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్కట్ చేశారు. ఆదిలాబాద్లో నిర్వహించిన ఫొటోగ్రఫీ కాంటెస్టులో మండల కేంద్రానికి చెందిన బూస లక్ష్మణ్ ఉత్తమ ఛాయాచిత్రానికి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు.

పద్మశాలి శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కైలాస్నగర్: తెలంగాణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న హైదరాబాద్లోని సరూర్నగర్ స్టేడియంలో నిర్వహించనున్న పద్మశాలి శంఖారావం సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేత రమేశ్ కోరారు. సభకు సంబంధించిన వాల్ పోస్టర్ను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో వెనుకబడ్డ పద్మశాలిలకు అభివృద్ధి, సంక్షేమం, రాజ్యాధికారంలో వాటా ఇవ్వాలన్నారు. జిల్లాలోని పద్మశాలి కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం తాలూకా అధ్యక్షుడు బొమ్మకంటి రమేశ్, ప్రధాన కార్యదర్శి చిలుక విలాస్, దాసరి రమేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సెకండ్ బెటాలియన్ అధికారి

ఎదులాపురం: సెకండ్ బెటాలియన్ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన చటర్జీ ఎమ్మెల్యే జోగు రామన్నను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

మహిళల రక్షణ కోసమే షీటీం



అవగాహన కల్పిస్తున్న షీటీం ఇన్చార్జి ఎస్సై సునీత

ఎదులాపురం: మహిళలకు రక్షణ కల్పించేందుకు షీటీం పని చేస్తుందని షీటీం ఇన్చార్జి ఎస్సై సునీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శనివారం మహిళల రక్షణ, భద్రత, మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా వేధిస్తే ఫిర్యాదు చేయాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ క్రాంతికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారమే లక్ష్యంగా పని చేయాలి

కడెం: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొమ్ము విజయ్ పిలుపునిచ్చారు. మండలంలోని కొండుకూర్లో కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి సతీశ్రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఇటీవల నూతనంగా ఎన్నికైన కడెం, దస్తురాబాద్, జన్నారం, ఖానాపూర్, ఉట్నూర్ మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎన్ఎస్యూఐ అసెంబ్లీ అధ్యక్షుడు రాకేశ్లను సన్మానించారు. తరి శంకర్, చంద్రయ్య, బరుపటి రమేశ్, నాగోరావు పాల్గొన్నారు.

భోరజ్లో సంబురాలు



సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

జైనథ్: మండలంలోని భోరజ్ గ్రామ సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారి వద్ద బీఆర్ఎస్ శ్రేణులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంబురాలు జరుపుకున్నారు. శనివారం కొత్త మండలాల ఏర్పాటుకు అవసరమైన జీవో కాపీ విడుదల కావడంపై హర్షం వ్యక్తం చేశారు. టపాసులు పేల్చి, మిఠాయిలు తినిపించారు. జైనథ్లో కొత్తగా భోరజ్, సాత్నాల మండలాల ఏర్పాటుతో ప్రజలకు ఎంతగానో సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఎమ్మెల్యే జోగు రామన్నకు, సీఎం కేసీఆర్కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, వైస్ ఎంపీపీ సావాపూరే విజయ్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ముక్కెర ప్రభాకర్, సర్పంచ్లు పాల్గొన్నారు.

సమాచారం

వైద్యులకు సన్మానం

ఎదులాపురం: వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పలువురు వైద్యులను డీఎంహెచ్వో చాంబర్లో శనివారం సన్మానించారు. జిల్లా మలేరియా అధికారి శ్రీధర్ ఇటీవల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిగా నియమితులవడం, జిల్లా కుష్టు, టీబీ నియంత్రణ అధికారి శ్రీకాంత్కు ఈజీ రేడియాలజీలో సీట్ వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని సన్మానించారు. డీఎంహెచ్వో నరేందర్రాథోడ్, డీఈఎం అధికారి వామన్రావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ పారాయణ్ ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్యే

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో గత మూడు రోజులుగా మహేశ్వరీ సమాజ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ పారాయణ్ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. భగవాన్ రాధాకృష్ణ మహరాజ్ మహా భాగవత మహాత్మ్యాన్ని భక్తులకు వివరిస్తున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే జోగు రామన్న భగవాన్ రాధాకృష్ణ మహరాజ్ను కలిసి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

సీఎం కేసీఆర్కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

ఎదులాపురం: పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలో రెండు నూతన మండలాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయగా.. ఇందుకు కృషి చేసిన సీఎం కేసీఆర్కు ఎమ్మెల్యే జోగు రామన్న ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. 28 గ్రామాలతో భోరజ్ మండలం, 18 గ్రామాలతో సాత్నాల మండలాలను ఏర్పాటు చేసింది ప్రభుత్వం.

నీటి వసతి ఏర్పాటు

బోథ్: మండల కేంద్రంలోని బస్టాండ్లో ప్రయాణికుల సౌకర్యార్థం మాసం లక్ష్మి జ్ఞాపకార్థం తనయుడు అనిల్ కుమార్ నీటి వసతిని ఏర్పాటు చేశారు. ఆయనను ఆర్టీసీ కంట్రోలర్ సాయన్న, వీడీసీ అధ్యక్షుడు గంగాధర్ సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గట్ల గంగాధర్, భోజన్న, అబ్రార్, సాభీర్, భూమన్న పాల్గొన్నారు.

ఘనంగా ప్రజామిత్ర మహాసభ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ త్రిలోచన్ శాస్త్రి

ఉట్నూర్రూరల్: ప్రజామిత్ర 16వ వార్షిక మహాసభను ఉట్నూర్లో నిర్వహించారు. మహాసభకు ఐఐఎం బెంగుళూరు నుంచి సెంటర్ ఫర్ కలెక్టీవ్ డెవలప్మెంట్ (సీసీడీ) సంస్థ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ త్రిలోచన్ శాస్త్రి హాజరయ్యారు. రైతు సంఘాల సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. రైతు సంఘాలు వ్యాపారం చేయడం వల్ల నేరుగా రైతులే లాభం పొంది దళారీ వ్యవస్థ నిర్మూలించబడుతుందన్నారు. రైతులు పండించిన పత్తి, సోయా, కంది పంటలు ప్రాసెసింగ్ చేసి మార్కెటింగ్ చేయడం ద్వారా రైతులకు లాభ పడుతారని అన్నారు. ఇటువంటి రైతు సంఘాలను దేశం మొత్తం ఏర్పాటు చేయాలన్నారు. ప్రజామిత్ర పాలకవర్గ సభ్యులుగా ఎనికైన మెస్రం బాదిరావు, సోయం జుగాదిరావు, సిడా గంగాదర్లను సీసీడీ ఉపాధ్యక్షుడు ప్రాజెక్టు మేనేజర్ విఠల్రావుతో ప్రతిజ్ఞ చేయించారు. రైతు సంఘాల సభ్యులు, సీసీడీ సిబ్బంది లక్ష్మినారాయణ, ప్రశాంత్, అస్లాం మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధికి నోచుకోని ఆదివాసీ గ్రామాలు'



చీకట్లో గ్రామానికి వెళ్తున్న నాయకులు

బోథ్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్లు గడుస్తున్నా.. ఆదివాసీ గ్రామాలు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదని పీసీసీ సభ్యులు వన్నెల అశోక్ అన్నారు. శనివారం మండలంలోని నేరడుపల్లెలో రాత్రి పర్యటించారు. ఆదివాసీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి కనీసం రోడ్డు లేదని, బురదలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఆదివాసీ గ్రామాలను అభివృద్ధి చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందరన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి ప్రతీ గ్రామానికి రోడ్డు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో మల్లెపూల సత్యనారాయణ, మల్లేశ్, నల్ల శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.